కంపోస్టు యార్డుకు త్వరలో మంగళం

- పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపునకు శ్రీకారం
- దాదాపు 95 వేల టన్నుల వ్యర్థాల విభజన ఆరంభం
- మరోవైపు రోజువారీ చెత్త జిందాల్‌కు తరలింపు
- నాలుగు నెలల్లో ఖాళీ కానున్న కంపోస్టు యార్డు


ఆధునిక ట్రామ్మెల్‌తో వ్యర్థాల విభజన ప్రక్రియ

తెనాలి: ప్రజలకు సమస్యగా మారిన పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని మున్సిపల్ కంపోస్టుయార్డు ఖాళీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆధునిక ట్రామ్మెల్‌తో యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన ఘనవ్యర్థాలను విభజనను ఆరంభించారు. ప్లాస్టిక్‌తో ఇతర వ్యర్థాలు ఒకవైపు, మట్టి మరోవైపున చేరుస్తున్నారు. మరోవైపు రోజువారీ వచ్చే చెత్తను జిందాల్‌కు వాహనాల్లో తరలిస్తున్నారు. మొత్తంమీద ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కంపోస్టుయార్డు సమస్యకు త్వరలోనే మోక్షం లభించనుంది.

తెనాలి పట్టణ జనాభా ఏటికేడాది విస్తరిస్తూ ఉంది. జనాభా దాదాపుగా రెండు లక్షలకు చేరుకుంది. రోజురోజుకీ చెత్త పెరుగుతోంది. ప్రస్తుతం పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 80 టన్నుల చెత్త వస్తోందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఇందులో తడిచెత్త, పొడిచెత్త ఉంటాయి. ప్లాస్టిక్ సంచులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా ఉంటున్నాయి. రోజువారీ చెత్తను తగ్గించాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇదే కంపోస్టుయార్డులో తడిచెత్తనుంచి వర్మీకంపోస్టు, బయోగ్యాస్ తయారీ యూనిట్లను నిర్వహిస్తున్నారు. ఇకపోతే మిగిలిన చెత్తంతా యార్డులో పేరుకుపోతోంది.

కంపోస్టు యార్డుతో సమీపంలోని పంటపొలాలకు సమస్య ఏర్పడుతుందని సమీప రైతులు పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నారు. ప్రహరీలు పడిపోతుండటం మరో సమస్య. దీనికితోడు చెత్తనుంచి మిథైల్ గ్యాస్ విడుదలవుతూ, చెత్త దానికదే తగులబడుతోంది. రోజుల తరబడి కొనసాగటంతో దానినుంచి వచ్చే హానికరమైన పొగలు సమీపంలోని అరకిలోమీటరు వరకూ వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రజలకు కళ్ల మంటుతూ, ఊపిరి పీల్చుకోవటానికి ఇబ్బంది పడుతున్నారు. ఆ దారిలోనే పలు విద్యా సంస్థలున్నాయి. దాల్ మిల్లులున్నాయి. అతిదగ్గర్లోనే అపార్టుమెంట్లు, బీసీ కాలనీ ఉన్నాయి. కంపోస్టు యార్డు కారణంగా వీరందరూ బాధితులే. రోజూ వాకింగ్ చేసే అలవాటున్న వాకర్స్ కూడా ఈ వాయుకాలుష్యం కారణంగా అటుకేసి వెళ్లటం లేదు.

సమీప బుర్రిపాలెంకు చెందిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కంపోస్టుయార్డును అక్కడి నుంచి తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం టన్నుకు రూ.503 చొప్పున రూ.3.17 కోట్లకు టెండరు ఖరారైంది. అమృత్ నిధులు, మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. టెండరు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన సుధాకర ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధునిక ట్రామ్మెల్‌ను కొద్దిరోజుల క్రితం ఇక్కడకు చేర్చింది. కంపోస్టు యార్డులోని పేరుకుపోయిన చెత్త, డ్రై అయ్యేందుకని చెత్త గుట్టల మధ్య దారులు చేసి, గాలి ఆడేలా చేశారు. ట్రామ్మెల్‌ను బిగించి ట్రయల్ రన్ అనంతరం మంగళవారం నుండి పనిని ప్రారంభించింది. ఇక్కడ పనిచేస్తున్న వర్కర్లు బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌కు చెందినవారు.

కంపోస్టు యార్డులోని వ్యర్థాల పరిమాణంపై 2022లో డ్రోన్‌తో సర్వే చేశారు. అప్పటికి 63,555 టన్నులు ఉన్నట్టు అంచనా వేశారు. గత రెండేళ్లలో మరో 30 వేల టన్నులు చేరి ఉంటుందన్న అంచనాతో మొత్తం 90 వేల టన్నులు వ్యర్థాలు అక్కడున్నాయి. ముందుగా కూలీలను నియమించి చెత్తలోని పెద్ద టైర్లు, కర్రలు, రాళ్లను తొలగించేశారు. ఇప్పుడు ట్రిమ్మెల్‌తో ప్లాస్టిక్, ఇతర చెత్త ఒకవైపు చేర్చుతుండగా, మరోవైపున మట్టి, ఇసుక, కంకర వంటివి గుట్టపోస్తోంది. వీటిలో ప్లాస్టిక్, ఇతర చెత్తను జిందాల్ / సిమెంటు ఫ్యాక్టరీలకు తరలిస్తారు.

మట్టి/ఇసుక వంటి వ్యర్థాలు ఎక్కడైనా పల్లపు భూములు మెరక చేసుకునేందుకు వినియోగించే అవకాశం ఉంది. మొత్తంమీద ఏడునెలల కాంట్రాక్టు జూలై 15వ తేదీలోగా పూర్తవుతుంది. ఇకపోతే రోజువారీ పట్టణంలోంచి వచ్చే చెత్తను కంపోస్టు యార్డులోనే ప్రత్యేకంగా చేర్చుతున్నారు. మున్సిపాలిటీకి గల మూడు చిన్న కాంట్రాక్టర్లు, ఒక పెద్ద కాంట్రాక్టరుతో పాటు అయిదారు ట్రక్కులను అద్దెకు తీసుకుని జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు.

నాలుగు నెలల్లో పూర్తవుతుంది



కంపోస్టు యార్డు నుంచి వ్యర్థాల తొలగింపు టెండరు జనవరి 15 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పుడు పని ప్రారంభమైనందున నాలుగు నెలల్లో పూర్తవుతుందని భావిస్తున్నాం. ప్రతిరోజూ వచ్చే చెత్తను ఏరోజుకారోజు జిందాల్‌కు పంపుతున్నాం. ఇందుకోసం అదనపు వాహనాలను ఏర్పాటుచేశాం. కంపోస్టు యార్డును ఖాళీచేయటం, ప్రతిరోజూ చెత్తను తరలిస్తూ చెత్త సమస్య నిర్మూలన దిశగా కృషి జరుగుతోంది.

– ఆకుల శ్రీనివాసరావు, మున్సిపల్ ఇన్‌చార్జి ఇంజినీరు

మైనాక వాహనంలో పంచముఖ ఆంజనేయుడు


పంచముఖ ఆంజనేయస్వామి వాహనసేవ

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన మంగళవారం ఉదయం విశేషపూజలు నిర్వహించి, నిత్యహోమం జరిపారు. అనంతరం శ్రీ మైనాక వాహన సేవ, సాయంత్రం శ్రీసువర్చల హనుమంతు కల్యాణోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. పట్టణ పుర వీధుల్లో కనుల పండువగా కొనసాగిన వాహన సేవలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో, వేదాంతం నాగమారుతి బృందం వైఖానస ఆగమ రీతిలో వైదిక క్రతువును ఘనంగా జరిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలను ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి వివరించారు. అర్చకులు మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లోని భక్తులు వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. 12 తేదీన శ్రీవారి రథోత్సవం, 13న పూర్ణాహుతి, చివరి రోజైన 14న పుష్పోత్సవం జరుగుతాయని తెలిపారు. శ్రీసువర్చల హనుమత్ కల్యాణోత్సవంలో నితిన్ శాండిల్య దంపతులు, మాజేటి వెంకటేష్ దంపతులు పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక అలంకరణతో విద్యుత్ దీపాలతో శోభాయమనంగా తీర్చిదిద్దారు. ఆర్.సురేష్, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రశేఖర్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

శిల్పకళలో కాటూరి సేవలు అభినందనీయం

కాటూరి ఆర్ట్ గ్యాలరీలో కొత్త సుబ్రహ్మణ్యం


గ్యాలరీలో శిల్పాల వద్ద సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెలగా కుటుంబ సభ్యులు

తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం మంగళవారం కంచర్లపాలెం దగ్గర్లోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. గ్యాలరీలో ఉంచిన పలు రకాల విగ్రహాలను తిలకించారు. శిల్పకళలో తెనాలి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతున్న శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్షను అభినందించారు. భారీ విగ్రహాల తయారీలో తీసుకురాబోతున్న అత్యాధునిక 5–యాక్సిస్ 3డీ సాంకేతికతను శ్రీహర్ష వివరించారు. గ్రంథాలయోద్యమ ప్రముఖుడు దివంగత డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కుమారులు వెలగా సర్వోత్తమ, వెలగా నాగార్జున, వెలగా వెంకట్రావు, వెంకటప్పయ్య సోదరుడు వీరయ్య కూడా ఈ సందర్భంలో ఉన్నారు.

ఘనంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ బలిదాన్ దివస్


నివాళులర్పిస్తున్న నాయకులు

తెనాలిటౌన్: పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ సేవలు నిరుపమానమని బీజేపీ తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కె.వాసుదేవనాయుడు పేర్కొన్నారు. పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ బలిదాన్ దివస్ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొలకలూరు, అంగలకుదురు, ఎరుకలపూడి గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవనాయుడు మాట్లాడుతూ జనసంఘ్ అధ్యక్షునిగా బీజేపీ హైందవ సిద్ధాంతానికి పునాదిగా చెప్పబడే దీన దయాళ్ ఉపాధ్యాయ సేవలు నిరుపమానమని కొనియాడారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, బీసీ మోర్చ మండల అధ్యక్షుడు వీరయ్య, బ్రహ్మయ్య, లక్ష్మీప్రసన్న, పి.వెంకట్రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూనిక్ నెంబర్ ఏర్పాటు



రైతు నుంచి సమాచారం అందిస్తున్న వీఏఏ నాగరాజు

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం భూమి కలిగిన ప్రతి రైతుకు యూనిక్ నెంబర్ ఏర్పాటు చేస్తున్న కొలకలూరు గ్రామ రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు నాగరాజు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు యూనిక్ నెంబర్‌లను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతుకు ఆధార్‌కార్డు మాదిరిగా యూనిక్ నెంబర్‌ను ఏర్పాటు చేస్తుందని, దీని వలన పీఎం కిసాన్ ద్వారా అందించే నగదు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందే రుణాలు, సబ్సిడీ ద్వారా ఎరువులు, యంత్ర పరికరాలు అందుతాయని తెలిపారు. ప్రతి రైతు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి తమ పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, 1బీ, అడంగల్, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్‌ను తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని తెలిపారు. కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో రెండు రోజుల నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు కొలకలూరులో 200 మంది రైతుల నుంచి సమాచారం సేకరించి యునిక్ నెంబర్‌లను రైతులకు అందించినట్లు వీఏఏ నాగరాజు చెప్పారు.

వైభవంగా గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఆలయ 23వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో గణపతిపూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, పూజలు చేసి లక్ష్మీతిరుపతమ్మకు అష్టోత్తర, సహస్ర నామ పూజలు అర్చకులు పూర్ణ నాగసాయి నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీగణపతి హోమం చేసి విశేష అర్చనలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

గుండెపోటు బాధితులకు అందుబాటులో ఇంజక్షన్



తెనాలి అర్బన్: గుండె పోటు వచ్చినప్పుడు చేసే టెనెక్టేప్లెస్ ఇంజక్షన్ జిల్లా వైద్యశాలలో అందుబాటులో ఉందని సూపరింటిండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలలో మంగళవారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌లకు, ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు దీనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీని విలువ రూ.45 వేలు ఉంటుందని, అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. గుండె పోటు లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యశాలకు రావాలన్నారు. గంటలోపు చికిత్స అందించకపోతే ప్రాణహానికి అవకాశం ఉందని తెలిపారు. రోగులు తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఫిజీషియన్లు డాక్టర్ డి.శ్రీకాంత్, డాక్టర్ టి.వినిల్, డాక్టర్ చలపతిరావు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ అపర్ణ, నర్సింగ్ సూపరింటిండెంట్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన


ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. జోనితిన్, సమన్వయకర్త పి.సురేష్, వలంటీర్ల యూనివర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ విద్యార్థులను అభినందించారు.

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఏఐ, డీఎస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. వర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు పెరిగిపోయాయని, వాటితో పాటే సైబర్ మోసాలు కూడా జరుగుతున్నాయన్నారు. సురక్షితమైన లావాదేవీలు నిర్వహించాలంటే నమ్మకమైన యాప్స్‌ను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఏఐ, డీఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1905కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి,

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హర్షవర్ధన్

మంగళగిరి టౌన్: గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని యూపీహెచ్‌సీ వైద్యులు హర్షవర్ధన్ సూచించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు, బీపీ, షుగర్, హెచ్‌బీ, యూరిన్ తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ 20 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో ఇద్దరు హైరిస్క్ ప్రెగ్నెన్సీగా గుర్తించామని చెప్పారు. ప్రతి గర్భిణి మూడు సార్లు అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు శైలజ, ప్రసన్న, ఆశ వర్కర్లు నూర్జహాన్, భారతి, సునీత, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, సిబ్బంది ప్రేమ, దుర్గాభవాని పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు


సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులు


సంస్మరణ సభ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నూతక్కిలో మంగళవారం గ్రామీణ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. శ్రీ శక్తేశ్వరస్వామి ఆలయం వద్ద నూతక్కికి చెందిన ప్రఖ్యాత రంగస్థల కళాకారులు జొన్నల సుబ్బారెడ్డి, అన్నపురెడ్డి శివరామరెడ్డి సంస్మరణార్థం నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎ. వెంకటలక్ష్మి చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు నూతక్కితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వీక్షించేందుకు ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని జొన్నల పేరిరెడ్డి, కొల్లి సంజీవరెడ్డి నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులు దుర్గారావు

తాడేపల్లిరూరల్: ఏసీసీ కార్మికుల న్యాయమైన సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నట్లు తాడేపల్లి సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని నాయకులు కె.ఆదినారాయణ, కూరపాటి స్టీవెల్‌తో కలసి ప్రారంభించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకునే విధంగా చూడాలని కార్మికులు కోరుతున్నారని అన్నారు. ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, ఎం.గురవయ్య, వి.రమణ, మల్లేశ్వరి, మూర్తి, హగ్గయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాల్వల్లో వ్యర్థాలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో ఉన్న వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మారీసుపేటలో మంగళవారం జరుగుతున్న గ్యాంగ్ వర్క్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లో పైన పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం వలన పారుదల జరగదని చెప్పారు. కాల్వల్లో కింద నుంచి పూర్తిగా వాటిని తొలగిస్తే కాల్వలు శుభ్రంగా ఉంటాయని చెప్పారు. అలాగే దోమల వ్యాప్తి కూడా తగ్గుతుందన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 23 మంది ఎంపిక



తెనాలిఅర్బన్: గుంటూరుకు చెందిన ఇంగ్లీష ఫర్ యు సంస్థ ఆధ్వర్యంలో జెఎంజె మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 23 మంది విద్యార్థినీలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ తెలిపారు. విద్యార్థినీలకు పలు రకాల పరీక్షలు నిర్వహించి వాటిలో ఉత్తీర్ణత సాధించిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2లక్షల వేతనం ఇవ్వనున్నట్లు వివరించారు. అనంతరం వారిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు యు.ప్రసాద్, వి.ఈశ్వర్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్‌థెరిస్సామ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారదమేరి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు త్వరగా వసూలు చేయండి



తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థల, నీటి పన్నులను త్వరగా వసూలు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు ఆదేశించారు. 18వ వార్డులోని వార్డు సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష జరిపారు. పన్నులు చెల్లించని వారి ఇళ్లకు వెళ్లి వాటిని వసూలు చేయాలని సూచించారు. తెనాలి పట్టణంలో నూరు శాతం పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన పలు షాపులకు వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మహాశివరాత్రి తిరునాళ్లకు 53 బస్సులు

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని సంగంజాగర్లమూడి సమీపంలోని క్వారీ, గోవాడకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మంగళవారం తెలిపారు. క్వారీకి 25 బస్సులు, గోవాడకు 28 బస్సులు సాధారణ చార్జీలతో నడపనున్నట్లు చెప్పారు. 26వ తేదీ తెల్లవారుజామున 3గంటల నుంచి 27వ తేదీ భక్తుల రద్దీ తగ్గే వరకు బస్సులు నడుపుతూనే ఉంటామన్నారు. ప్రతి రెండు నిమిషాలకు ఒక బస్సును నడిపేవిధంగా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, భక్తులందరూ తమ సంస్థను ఆదరించాలని తెలిపారు.

చోరీకి పాల్పడుతున్న మహిళ పోలీసులకు అప్పగింత

మంగళగిరి టౌన్ : చోరీకి పాల్పడుతున్న ఓ మహిళను పట్టణ పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం నగరంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్ ఆఖరి లైన్‌లో ఓ గోడౌన్ ఉంది. ఆ గోడౌన్‌లో తలుపులు, గడియలు, తాళాలు, హార్డ్‌వేర్ సామాన్లు ఉన్నాయి. ఒక మహిళ గోడౌన్ కిటికీ పగలకొట్టి అందులో నుంచి బస్తాలతో సామాన్లను తీసుకువెళుతుండగా స్థానికులు గమనించారు. వారు దగ్గరకు రావడంతో బయట బస్తాలు అందుకుంటున్న మహిళతో పాటు ఆటోతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి పరారయ్యారు. గోడౌన్ లోపల ఉన్న మహిళను స్థానికులు పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. దొంగిలించిన సామాన్ల బస్తాతో సహా ఆటోలో వేసుకుని ఆటోను, ఆ మహిళను మంగళగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన మహిళ నగరంలోని గండాలయ్యపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పరారైన ఇద్దరిని పట్టుకునే పనిలో పట్టణ పోలీసులు నిమగ్నమయ్యారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: ఐసీఐసీ బ్యాంకు ఆధ్వర్యంలో కొనాక్ డయాగ్నోస్టిక్స్ వారి సహకారంతో బుధవారం గంగానమ్మ పేటలోని ఐసీఐసీ బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బ్యాంకు అధికారిణి ఆషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. షుగర్, బీపీ, ఇతర పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. కస్టమర్లందరూ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోండి



దుగ్గిరాల: ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందడానికి పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.శిరీష పేర్కొన్నారు. ఈమని గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మొక్కజొన్న పంటలను పరిశీలించి, భూసారీ పరీక్షలు నిర్వహించారు. ఏఈవో, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి విఘ్నేశ్వర స్వామి ఆలయ వేడుకలు

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి నూతన ఆలయ వేడుకలు బుధవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వరకు ఐదు రోజులు పాటు ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామన్నారు. పూజలలో భక్తులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నేడు భావనారుషి స్వామి కల్యాణం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణంలోని పద్మశాలీయ బజార్‌లో వేంచేసి యున్న భద్రావతి సమేత భావనా ఋషి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి జరిగే ఊరేగింపునకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 14న అన్న సంతర్పణ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

లక్ష్మణరావు గెలుపునకు విస్తృత ప్రచారం



తాడేపల్లిరూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల పీడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో మంగళవారం ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. లక్ష్మణరావు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపైనే కాకుండా రైతాంగ, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ప్రశ్నించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టిరంగారావు, కేవీపీఎస్ నాయకులు నల్లపు కిషోర్‌బాబు పాల్గొన్నారు.

వేగవంతంగా ఎన్‌సీడీ సీడీ సర్వే

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యులు శ్వేత, ఫరీనాబేగం మంగళవారం తెలిపారు. సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యక్తుల ఆరోగ్య వివరాలు తెలుసుకుని వాటిని యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. వాటితో పాటు క్యాన్సర్ కారణాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు, గర్భ సంచిలో వచ్చే సమస్యలు వాటిని గుర్తించే విధానం గురించి వివరిస్తున్నారని తెలిపారు.